సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
అనంతపురం | శ్రీ సత్యసాయి
బుధవారం 03 జూలై 2024 పేజీలు 10

# నూతన కలెక్టర్‌గా టీఎస్ చేతన్ నియామకం..

## - శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు బదిలీ

పుట్టపర్తి మేజర్ న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదికాలంగా సత్యసాయి జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్న అరుణ్ బాబును పల్నాడు జిల్లా కలెక్టర్ గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర మద్యం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్న టిఎస్ చేతన్‌ను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సత్య సాయి జిల్లా ఏర్పాటైన సమయంలో టిఎస్ చేతన్ జాయింట్ కలెక్టర్ గా పనిచేశారు. ఏడాది క్రితం బదిలీ అయిన టీఎస్ చేతన్ తిరిగి సత్యసాయి జిల్లా కు కలెక్టర్ గా నియమితులయ్యారు.



జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు



టిఎస్ చేతన్

### బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

# పరిటాల రవీంద్ర..

- రాష్ట్ర మంత్రులు సవిత, సత్య కుమార్..
- ఆయన పోరాటాన్ని, త్యాగాన్ని తెలుగుజాతి మర్చిపోదు...
- వెంకటాపురానికి వచ్చిన మంత్రులు సత్యకుమార్, సవిత
- పరిటాల ఘాట్ వద్ద నివాళులు.. మంత్రుల రాకతో సందడి..



**రామగిరి మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన పరిటాల రవి ఒక నిప్పు కణిక లాంటి వారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సత్యకుమార్ తో పాటు బీసీ సంక్షేమశాఖ మంత్రి కురుబ సవిత పరిటాల స్వగ్రామం అయిన రామగిరి మండలం వెంకటాపురంలో పర్యటించారు. మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మంత్రులకు ఘన స్వాగతం పలికారు. ముందుగా వారు గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరిటాల ఘాట్ ను సందర్శించారు. అక్కడ పరిటాల రవికి ఘనంగా నివాళులర్పించారు. ఘాట్ లో ఏర్పాటు చేసిన శిలాఫలాకాలను పరిశీలిస్తూ.. పరిటాల రవి జీవితంలో జరిగిన సంఘటనలను ఆసక్తిగా తెలుసుకున్నారు. అనంతరం వారు పరిటాల నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో

మిగతా 2లో

# డ్యూటీకి డుమ్మా!!

అది ఒక సేవా విభాగం, అంతటి ఆ శాఖలో అంతా సీమలోని ఆ రెడ్డి డైరెక్షన్లో... సిబ్బందికి "108" ఇబ్బందులను తెచ్చి పెడుతున్నాడు. పైవారికి చెప్పుకోలేక ఆ సిబ్బంది పడుతున్న వేదన అరణ్య రోదనే అని చెప్పవచ్చు. ఆ శాఖలో రాయలసీమకు ఆయన ఇంచార్జ్ కావడంతో సొంత జిల్లా కర్నూలులో కాలక్షేపం, అనంతలో చుట్టపు చూపు విధులు చేస్తూనే పేరువెనకాల ఆ తోకను పెట్టుకొని సేవకు సంబంధించిన ప్రభుత్వ శాఖ నే తన గుప్పెట్లో ఉంచుకొని శాసిస్తున్నాడు రాయలసీమ ఇన్చార్జిగా ఉన్న ఆ రెడ్డి అధికారి.

- 108ను సర్వ నాశనం చేస్తున్న ఆ పై రెడ్డి అధికారి
- ఉత్తుత్త పర్యటన పేరుతో సిబ్బందికి లేనిపోని ఇబ్బందులు
- జిల్లా అధికారులకు చెప్పలేక సిబ్బంది నానాయాతన..
- గాడి తప్పుతున్న 108 సేవలు..
- జిల్లా అధికారులే కాపాడాలంటున్న వైద్య సిబ్బంది..



04 పేజీలో



# అవినీతి తహశీల్దారు అవసరమా.?

- ఎన్నికల విధుల కోసం వచ్చిన తహశీల్దారు ఉంటారా వెళ్తారా?
- గతంలో ఈ తహశీల్దారు ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు
- ఎన్నికల విధుల సమస్యలు తప్ప ఇతర సమస్యలపై దృష్టి సారించని తహశీల్దారు

**గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ :** ప్రజలు వారి సమస్యలను అధికారులకు తెలిపిన వెంటనే వాటిని పరిశీలించి పరిష్కారం చేసే అధికారులు కొందరైతే ఆ పనులు చేస్తే మనకెంత లాభం వస్తుంది అనుకునే అధికారులు మరికొందరు ఉన్నారు. గుంతకల్లు ప్రజలు ఏ పాపం చేశారో తెలియదు కానీ గుంతకల్లుకు అయితే కొందరు అధికారులు పనులు చేస్తే లాభాలను ఆశించే అధికారులే వస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడ పనిచేసిన తాసిల్దారు ఎఫ్ఎసిగా ఉంటూ ఎంతో అవినీతికి పాల్పడ్డాడు. బినామీ పేర్లతో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ, ప్రజల సమస్యలపై నిర్లక్ష్యంగా ఉంటూ పనులు చేశారు. కానీ ఈ ప్రభుత్వంలోనైనా కొత్తగా వచ్చే తాసిల్దారు ప్రజలకు సేవలు చేసే అధికారులు రావాలని గుంతకల్లు ప్రజలు ఆశిస్తున్నారు.

**ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులపై ఏసీబీ సోదాలు**

ప్రస్తుతం గుంతకల్లులో తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆయన గుంతకల్లుకు ఎన్నికల విధుల నిర్వహణ కోసం నాలుగు నెలల కిందట వచ్చాడు. అయితే ఇప్పుడు ఎన్నికల విధులు ముగిసాయి ప్రస్తుతం జరిగే తహసిల్దారుల బదిలీలలో ఈయనను బదిలీ చేస్తారా లేకుంటే ఇక్కడే పెట్టుకుంటారా? అని ఆలోచనలో గుంతకల్లు ప్రజలు వేచి చూస్తున్నారు. ఈ తహశీల్దారు గతంలో కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, గూడూరు తదితర మండలాల్లో తహశీల్దారుగా పనిచేశాడు. అయితే ఆళ్లగడ్డలో పని చేసేటప్పుడు ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు కూడ పెట్టాడని అభియోగంతో ఏసీబీ అధికారులు ఒకే రోజు ఒకేసారి ఐదు చోట్ల సోదాలు నిర్వహించారు. ఆ సోదాలలో భారీ మొత్తం నగదు, వెండి బంగారంను దాంతో పాటుగా విలువైన డాక్యుమెంట్లు పత్రాలు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించిన కేసు ఇప్పటికీ ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. దాంతో పాటుగా గూడూరులో విధులు నిర్వహించేటప్పుడు ఈ తహశీల్దారు అవినీతికి పాల్పడ్డాడని సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఇంతటి అవినీతికి పాల్పడి అక్రమ ఆస్తులు కూడా బెట్టిన తహశీల్దారును గుంతకల్లులో పెట్టుకుంటే ప్రజల సమస్యలు తీరవు గుంతకల్లులో ఉండే ప్రభుత్వ స్థలాలు మరియు మిగతా పనులలో అక్రమంగా ఇంకా సంపాదిస్తారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**గుంతకల్లులో ఎక్కడి సమస్యలు అక్కడే :**

గత కొన్ని నెలల నుంచి గుంతకల్లులో ప్రజల సమస్యలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అది ప్రస్తుతం ఉండే తహశీల్దార్ ను అడిగితే నేను కేవలం ఎన్ని కల విధులకు మాత్రమే వచ్చానని అంటూ గతంలో తప్పించుకున్నారు. మండలంలోని కసాపురం గ్రామానికి చెందిన ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీకి చెందిన ఒక వ్యక్తికి కొన్ని సంవత్సరాల కిందట ప్రభుత్వం భూమిని సాగు చేసుకోమని అధికారులు ఇచ్చారు. ఈ విషయంపై ఎన్నోసార్లు సంబంధిత తహశీల్దారు విఆర్ఓకు తెలిపిన ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అదే విధంగా డోనిముక్కల మల్లే నీపల్లి కసాపురం గ్రామాలలో నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని తోలుతున్నారు అయినా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

**సమస్యలు మా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాం - తహశీల్దారు**

ప్రజల సమస్యలు మా దృష్టికి వచ్చిన వెంటనే పరిశీలించి పరిష్కరిస్తున్నాం. ఎర్ర మట్టి తోలే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ ఆస్తులపై ఏసీబీ అధికారులు సోదాలు చేసిన విషయంపై వివరణ అడగగా అది నా వ్యక్తిగత విషయం దాని గురించి నేను మాట్లాడను అని వివరణ ఇచ్చారు.

## నీట్ పరీక్షను రద్దు చేయాలని 4న విద్యాసంస్థల బంద్..



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : నీట్ పరీక్ష ఫలితాలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించి పరీక్ష రద్దుచేసి, ఎండ్ టి ఏ ఏజెన్సీ సంస్థ రద్దు చేయాలని జులై 4న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ తెలిపారు. మంగళవారం స్థానిక గణనాయక భవన్ లో ఐక్య విద్యార్థి సంఘా ల ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, జిల్లా కార్యదర్శి కుల్లాయి స్వామి, ఎన్ఎస్యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుమల నరేష్ పీడీఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ ఏఐఎస్ఎ నగర కార్యదర్శి బాలకృష్ణ బీసీఎస్సీఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్ పిఎస్ఎఫ్ఎ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ఆలాం వివిఎస్ఐవి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ ఆర్ఎస్వైఎఫ్ జిల్లా నాయకులు భీమేష్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్ష పేపర్ ను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని పరమేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు రమణయ్య, గిరి, భీమేష్, చందు, సూర్య, సోము, ఓబులేసు, ప్రతిభ భారతి, మంజునాథ్, ఉమా మహేష్, వంశీ, భీమేష్, సోము, చంద్ర, హర్ష, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## రెండవరోజు సామాజిక భద్రత ఫించన్ల పంపిణి



అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : అనంతపురము రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయితీ పరిధిలోని రమణ కొట్టాలు లో ఎన్టీఆర్ సామాజిక భద్రత ఫించన్లను మంగళ వారం రెండవరోజు ఏపీ ఎమ్మార్పీస్ రాయలసీమ జిల్లాలు అధ్యక్షులు యు. రమణ ఆధ్వర్యంలో పంపిణి చేశారు. ఫించన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఫించన్ మొత్తాన్ని అందచేశారు. రమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్, మే, జూన్ నెలల నుంచే ం పెంచిన ఫించన్ మొత్తాన్ని అందచేయడం హర్షనీయమన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికి ఫించన్లు పంపిణి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, మల్లికార్జున, కుంటన్న, నాగరాజు, సోము,చిట్టి కొల్లప్ప, రషీద్, భాష, వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమం



తాడిపత్రి మేజర్ న్యూస్: మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క నాయకుడు వారి వారి బూతులలో తల్లికి వందనం పేరుతో పర్యావరణ పరిరక్షణ కోరకై ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటేలా పిలుపు నివ్వడం జరిగింది.ఇందులో భాగంగా తాడపత్రి రూరల్ మండల అధ్యక్షుడు. రాంబాబు మంగళవారం తన స్వగ్రామం వెంకటరెడ్డి పల్లి గ్రామం నందు తల్లికి వందనం పేరుతో చెట్టు నాటడం జరిగింది.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్

తాడిపత్రి మేజర్ న్యూస్:ఆంధ్రప్రదేశ్, ఉన్నత విద్యా మండలి 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్లైన్ లో డిగ్రీ ప్రథమ సంవత్సర అడ్మిషన్లు కొరకు నోటిఫికేషన్ విడుదల అయినట్లు తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు డిగ్రీ కోర్సులు బిఎ-హిస్టరీ, బీకాం-కంప్యూటర్ అప్లికేషన్, బి యస్ సి-మ్యాథమెటిక్స్ మరియు బొటాని (వృక్షశాస్త్రం ) కలవు. విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు పూర్తి చేయుటకు ఈనెల 2వ తారీఖు నుండి 10 వ తారీఖు వరకు రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు గడువు ఉండునట్లు తెలిపారు. అలాగే కళాశాలలను ఎంపిక చేసుకోనుటకు ఈనెల 11 వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఐచ్ఛికాలను నమోదు చేసుకోవచ్చు. తరువాత ఈనెల 19వ తారీఖు విద్యార్థులకు కళాశాలలో సీట్లు కేటాయించబడినట్లు తెలిపారు. సీట్లు కేటాయించబడిన అభ్యర్థులు ఈనెల 22వ తారీఖు లోగా కళాశాలలో చేరాల్సి ఉంటుంది. విద్యార్థులకు ఆన్లైన్ లో తలెత్తే సమస్యలను మరియు సందేహాలను నివృత్తి చేయడానికి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు హెల్ప్ లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్రింది ఫోన్ నెంబర్లు 92905 00488, 98497 77954, 94402 66204 మరిన్ని వివరాలకు సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ బి విజయలక్ష్మి తెలియజేశారు.




# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పరిటాల రవీంద్ర..

**మొదటి పేజీ తరువాయి**

పాల్గొన్నారు. పరిటాల కుటుంబసభ్యులతో కలసి చాలా సేపు గడిపారు. మంత్రుల రాకతో గ్రామంలో ఒ?క సందడి వాతావరణం నెలకొంది. ఈసందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ పరిటాల రవి అంటే ఒక వ్యక్తి కాదని.. ఆయన ఒక వ్యవస్థ లాగా బ్రతికారన్నారు. పెత్తందారులు, భూస్వాములకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఆయన జీవితం మొత్తం బడుగు బలహీన వర్గాల కోసం పని చేశారన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా సరికొత్త ఒరవడితో ముందుకెళ్లారన్నారు. ధర్మవరంలో అరాచక శక్తులతో పోరాడి ప్రజలకు అండగా నిలిచారన్నారు. అందుకే నేటికీ ధర్మవరంలో పరిటాల రవి పేరు చెబితే.. ఒక చిరు నవ్వు, ధైర్యం కనిపిస్తాయన్నారు. ఆయన పెనుకొండ, ధర్మవరం, రాప్తాడు ప్రజల కోసం ఎంతో చేశారన్నారు. ఆయన లక్షణాలను పరిటాల శ్రీరామ్ పుణికి పుచ్చుకున్నారన్నారు. రవి బాటలోనే శ్రీరామ్ నడుస్తూ ప్రజలకు అండగా నిలబడ్డారన్నారు. శ్రీరామ్ చిన్న వయసులోనే విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నారన్నారు. భవిష్యత్ లో ధర్మవరం, రాప్తాడు ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ.. ఈ ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రామ్మూర్తి



నాయుడు మాజీ ఎంపీపీ పరందామా యాదవ్ హిందూపురం పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య టిడిపి ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్ తెలుగు యువత అధ్యక్షుడు ఎల్ శ్రీధర్ నాయుడు, గుర్రం శ్రీనివాసులు తదితర టిడిపి నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### క్యాజువాలిటీ ఇక నుంచి

# అత్యవసర వైద్య విభాగం

**- అత్యవసర వైద్య విభాగాన్ని ప్రారంభించిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు..**
**- మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యం ..**



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉన్న క్యాజువాలిటీ నేటి నుంచి అత్యవసర వైద్య విభాగం గా మార్పు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు నూతన వైద్య విభాగాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు అత్యవసర వైద్య విభాగంలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. క్యాజువాలిటీ ని పూర్తిగా అత్యవసర వైద్య విభాగంగా ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. వైద్యుల సేవలను మరింత మెరుగుగా అందించే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా వీటిలో సౌకర్యాలను పెంచి ప్రజలకు చేరువ చేస్తామన్నారు. ప్రస్తుతం పెద్ద సంఖ్యలో అత్యవసర వైద్య విభాగానికి రోగుల తాకిడి అధికంగా ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అత్యవసర వైద్య విభాగం ద్వారా మెరుగైన వైద్య సేవలను అందిస్తామన్నారు. మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ డాక్టర్ హేమలత, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్ ఓ డి డాక్టర్ శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నూరుల్లా ఖాన్ పాల్గొన్నారు.

## తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేసిన వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ



కదిరి, మేజర్ న్యూస్ :కదిరి పట్టణంలోని 15 వ వార్డుకు చెందిన పింఛన్ దారు రెడ్డెమ్మ అనారోగ్యంతో తిరుపతి నగరంలోని హాస్పిటల్ లో వైద్య చికిత్సలు పొందు తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛన్ పెంపు చేయడంతో పాటు లబ్ధిదారుకి ఒకటో తేదీని పింఛన్ అందజే యాలన్న ఆదేశించారు. రెడ్డెమ్మ తిరు పతి లో చికిత్స పొందుతున్న విషయాన్ని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కి వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ ఇర్ఫాన్ తీసుకెళ్లగా, ఎమ్మెల్యే సూచన మేరకు సెక్రటరీ తిరుపతికి వెళ్లి ఇర్ఫాన్ లబ్ధిదారు రెడ్డెమ్మ కు రూ. 7000 పింఛను కార్యదర్శి అందజేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కు పింఛన్ లబ్ధిదారు రెడ్డెమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

# బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలి : ఏఐటీయూసీ

అనంతపురం రూరల్ మేజర్ న్యూస్: ప్రభుత్వ వైద్య కళాశాలలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల బకాయి ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని లేని పక్షంలో దశలవారి ఆందోళనలకు పూనుకుంటామని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు బకాయి ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని పనులు బందు చేసి వైద్య కళాశాల ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు జిఓ నెం 549 ప్రకారం జోన్ 1,2 లల్లో జూన్ నెల నుండి 16 వేల రూపాయల వేతనం ఇస్తుంటే ఇక్కడ ఉన్నటువంటి ఏ 1 స్పెషలిటిస్ వారు కొత్త వేతనం ఇవ్వకపోగా 4 నెలల వేతనాన్ని బకాయి పెట్టడం సరికాదన్నారు,పారిశుద్ధ్య కార్మికులకు 4 నెలల నుండి వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబ పోషణ ఏ విధంగా జరుగుతుందన్నారు.ఇంటి అద్దెలు కట్టలేని పరిస్థిలో ఉన్నారన్నారు, పిల్లలను చదివించుకోలేని పరిస్థితిలోకి నెట్టబడ్డారన్నారు,కాంట్రాక్టర్లు ఈపీఎఫ్, ఈఎస్ఐ కూడా సరిగ్గా జమచేయడం లేదన్నారు.ప్రభుత్వ



సెలవులు కూడా ఇవ్వట్లేదన్నారు, కార్మికులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న కార్మికుల గురించి ప్రిన్సిపల్,అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు,బకాయి ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని లేని పక్షంలో సామూహికంగా సెలవులు పెడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్,నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు,మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, నారప్ప, ప్రశాంత్, లక్ష్మీదేవి, ఫామీదా, అసీనా, గంగా పాల్గొన్నారు.

### గ్రామ సచివాలయాలను
## తనిఖీ చేసిన ఎంపీడీవో, ఈఓఆర్డి



**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్రీరంగాపురం, గుండ్లపల్లి, నరసాపురం గ్రామ సచివాలయం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో సుబ్బు రాజు, గ్రామ సచివాలయాలు తనిఖీల్లో భాగంగా సిబ్బంది హాజరు పుస్తకం ఆధారం చేసుకుని, వారి బయోమెట్రిక్ అటెండెన్స్ లను, ఈ సర్వీస్ వివరాలను పరిశీలించి అనంతరం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం కింద పెన్షన్ పంపిణీ వివరాలను సంబంధిత వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ లను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఎంపీడీవో, ఈఓఆర్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటలకు ఖచ్చితంగా బయోమెట్రిక్ అటెండెన్స్ ఉండాలని, అలా కాకుండా ఎవరైనా నియమ నిబంధనలు విరుద్ధంగా ప్రవర్తిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బరాజు, ఈఓఆర్డి మాధవరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ శ్రీరాములు, అశోక్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి పశువులకు బొబ్బ చర్మ వ్యాధి టీకాలు

**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** బెలుగుప్ప మండలంలో అన్ని గ్రామాల్లో పశువులకు మరియు గేదెలకు బొబ్బ చర్మ వ్యాధి టీకాలు బుధవారం నుండి ఉచితంగా వేయబడునని డాక్టర్ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు గంగవరం మరియు బెలుగుప్ప గ్రామాలలో టీకాలు వేయబడునని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ పశువులను వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలియజేశారు.

## పిల్లల్లో అతిసార మరణాలను అరికట్టాలన్నదే లక్ష్యం

**-వైద్యాధికారి డాక్టర్ తేజస్వి**



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** ఐదేళ్ల లోపు పిల్లలకు డయేరియా కేసులు రాకుండా అవసరమైన జాగ్రత్తలు చేపడుతున్నామని, అతిసార ను పూర్తిస్థాయిలో నిర్మూలించడమే వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యమని వైద్యాధికారి డాక్టర్ తేజస్వి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వజ్రకరూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ తేజస్వి ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పిల్లల్లో అతిసార మరణాలు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం డయేరియా క్యాంపెయిన్ ను జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సూపర్వైజర్ నాగ శంకర్, సుశీలమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారి గురు ప్రసాద్ తో కలిసి డాక్టర్ తేజస్వి డయేరియా కాంపెయిన్ పోస్టర్లను విడుదల చేశారు. అతిసార ప్రబలేందుకు కారణమైన కలుషిత నీరు, ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అతిసార బారిన పడిన పిల్లలకు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలచే చికిత్స అందించడం శ్రేయస్కరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుందుర్పికి రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించండి

**-కుల ధృవీకరణల కోసం ఇబ్బంది పడుతున్న విద్యార్థులు**

**కుందుర్పి, మేజర్ న్యూస్ :** కుందుర్పి మండలానికి రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలక్షన్ నిబంధనలో భాగంగా కుందుర్పి మండలానికి వచ్చిన తహశీల్దార్ హనుమంతు ఎలక్షన్ తర్వాత సెలవుపై వెళ్లిన విషయం తెలిసినదే. దీంతో మండల ప్రజల ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్న కుల, ధ్రువీకరణ పత్రాలు ప్రధానం కావటంతో అందుకోసం తహశీల్దార్ కార్యాలయంకి విద్యార్థులకు క్యూ కడుతున్నారు. మరొక పక్కా పంట రుణాలు కోసం పోతి పాస్ పుస్తకాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ప్రజలు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రెగ్యులర్ తహశీల్దార్ సెలవు పై వెళ్లడంతో సంబంధిత అధికారులు ఫుల్ అడిషనల్ అధికారిని నియమించకపోవడంతో మండలవ్యాప్తంగా వివిధ రకాల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మండలానికి ఫుల్ అడిషనల్ అధికారిని తక్షణమే నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు....

### ప్రైవేటు పాఠశాలలపై
## చర్యలు తీసుకోవడంలో మండల విద్యాశాఖ విఫలం

**-మండల వనరుల కేంద్రం వద్ద బైఠాయించిన టీఎన్ఎస్ఎఫ్**



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఆంగ్ల మాధ్యమ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి కొనసాగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎన్నోసార్లు మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోవడంలేదని టిఎన్ఎస్ఎఫ్ ఉరవకొండ నియోజకవర్గం అధ్యక్షులు ప్యారం భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ అధికారి తీరును నిరసిస్తూ మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వారు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు ప్యారం భరత్ మాట్లాడుతూ గత కొన్నేళ్ల కాలంగా స్థానిక వాణి విద్యానికేతన్, శాంతినికేతన్, కేర్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. వాటి నిర్వహణ పట్ల ఎన్నోసార్లు విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఆయన తనకు ఏమి పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చిన రేపు, మాపు అంటూ కాలం సాగదీస్తున్నారని మండిపడ్డారు. అయితే నిన్నటి రోజు నిబంధనలు పాటించని ఆంగ్ల మాధ్యమం పాఠశాలలపై చర్చించేందుకు విద్యాశాఖ కార్యాలయానికి రావాలని చెప్పినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. కార్యాలయానికి వెళ్లి నాలుగు గంటల వరకు వేచి చూసినా ఆయన అక్కడికి రాలేదని, చివరికి ఫోన్లో సంప్రదించగా మొబైల్ స్విచ్ ఆఫ్ చేసుకోవడం తమ పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు ఆక్రోశించారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి నాయకులు మండల వనరుల కేంద్రాన్ని బైఠాయించి ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది డివైఈఓ శ్రీదేవి దృష్టికి ఫోన్ ద్వారా విషయాన్ని సంప్రదించగా రేపటిలోగా మండల విద్యాశాఖ అధికారి స్పందించిన పక్షంలో జిల్లా నుంచి అధికారులను పంపుతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. దీంతో ఆందోళన విరమించినట్లు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వన్నూర్, యోగేష్, బబ్లు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మనూరు నారాయణను కలిసిన డా. పత్తి హిమబిందు

**గుంతకల్లు అర్బన్, మేజర్ న్యూస్ :** గుంతకల్లు నియోజకవర్గం గుత్తిలోని తాగునీటి సమస్యని పరిష్కరించిన గుంతకల్లు నియోజకవర్గం ఎన్డీఏ కూటమి శాసనసభ్యులైన గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణను గుమ్మనూరులోని వారి స్వగృహము నందు అనంతపురం టిడిపి పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు, నారాయణ, గుత్తి మాజీ టౌన్ ప్రెసిడెంట్ నరేంద్ర చౌదరి కలిసి అభినందనలు తెలిపారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా గుంతకల్లు నారా లోకేష్ సంఘం సభ్యులు సాయి క్రిష్ణ నర్సింగ్ హోమ్ అధినేతలు డాక్టర్ జిఎన్ వెంకటేష్ ను మరియు అనంతపురం టిడిపి పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు లను కలిసి గజమాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆనంద్ రెడ్డి, నారాయణ, మంజునాథ్, కదిరప్ప, రాఘవేంద్ర పాల్గొన్నారు. అలాగే జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా గుంతకల్లు బీజేపీ నాయకులు సాయి క్రిష్ణ నర్సింగ్ హోమ్ అధినేతలు డాక్టర్ జి ఎన్ వెంకటేష్ ను మరియు



అనంతపురం టిడిపి పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మహిళా మోర్చ విజయలక్ష్మి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పదమ్మ, టౌన్ ప్రెసిడెంట్ కళావతి, సూర్యనారాయణ, సతీష్ చౌదరి, హేమంత్, జయరాం, విశ్వనాథ్, మురళీధర్‌లు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలి

**-దేశవ్యాప్తంగా జూలై 4వ తేదీన విద్యాసంస్థల బంద్**
**-అఖిల భారత విద్యార్థి సమాఖ్య పిలుపు**



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చినట్లు, అన్ని విద్యార్థి సంఘాలు తమ వంతు మద్దతు ప్రకటించి బందును విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఉరవకొండ మండల అధ్యక్షులు హరున్ రషీద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరుతున్నట్లు తెలిపారు. పరీక్ష పత్రం లీకుకు కారణమైన ఎన్టిఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవీన్ కుమార్, సురేష్, కార్తీక్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రేగటి శివకృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు హిరణ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాలాపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**విడపనకల్లు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మాలాపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడిఈ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఉదయము 6 గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, గుంతకల్లు 132 కెవి లైన్ నందు మరమ్మతులు చేస్తున్నందువల్ల అంతరాయం ఉంటుందన్నారు. కనుక వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

## 60 కిలోమీటర్లు ప్రయాణించి పింఛన్ అందజేత



బుక్కపట్నం మేజర్ న్యూస్ బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కృష్ణమ్మ అనే మహిళ అనారోగ్యంతో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా 60 కిలోమీటర్లు ప్రయాణించి ఆమెకు సచివా లయ ఉద్యోగులు పింఛను పంపిణీ చేశారు. సర్వేయర్ సాయిరాం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయి ప్రసాద్ కృష్ణమ్మ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి అక్కడ ఆమెతో వేలిముద్ర వేయించుకుని ఏడు వేల రూపాయలు పింఛను అందజేశారు. సుదూర ప్రయాణం సాగించి ఆసుపత్రికి వచ్చి మరీ పింఛన్ అందుచేసిన సచివాలయ సిబ్బందికి కృష్ణమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

## రూరల్ మండలంలో 98.89శాతం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణి

### – ఎంపీడీవో పుల్లయ్య

అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : అనంతపురము రూరల్ మండల వ్యాప్తంగా 35 గ్రామ,వార్డు సచివాలయ పరిధిలో అర్హులైన ఫింఛన్‌దారులకు ఈనెల 1,2 తేదీలల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫింఛన్లను సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి 98.89శాతం పంపిణి పూర్తి చేసినట్లు రూరల్ ఎంపీడీవో పుల్లయ్య మంగళవారం తెలిపారు. జూలై నెల నుంచే రాష్ట్ర ప్రభుత్వం వృద్దులు, వితంతువులకు పెంచిన ఫింఛన్ మొత్తం రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.10,000, పూర్తిస్థాయిలో మంచానికే పరిమితైన వారికి రూ.15,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణి చేసినట్లు తెలిపారు. రూరల్ మండల వ్యాప్తంగా జూలై నెలకు 17,687 మంది అర్హులైన ఫింఛన్‌దారులకు ప్రభుత్వం రూ. 11,99,82,500లు మంజూరు చేసిందన్నారు. సోమవారం, మంగళవారం సాయంత్రం 5:15 నిముషాల సమాయానికి 17,496 మంది ఫింఛన్‌దారులకు రూ.11,86,54,000 ల ఫింఛన్ సొమ్మును సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణి చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. రెండు రోజుల్లో 98.89 శాతం పింఛన్ల పంపిణి చేశామని, మిగిలిన ఫించన్లు పంపిణి చేసి వందశాతం నమోదు చేస్తామని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఫించన్లు పంపిణి చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

## పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడుపుదాం



పామిడి, మేజర్ న్యూస్ : పట్టణంలోని ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయమని తెలుగు తమ్ముళ్లు పేర్కొన్నారు. పట్టణం లోని 15, 16వ వార్డులలో మంగళవారం శుభోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో డ్రైనేజీ,తాగునీరు సమస్యలను గుర్తించామన్నారు. గుర్తించిన ప్రజా సమస్యలపై గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాంకు నివేదించి వాటి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటారని వారు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను అడిగి తెలుసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తంచే శారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారికుమార్, వార్డు ఇంచార్జులు పట్రా శ్రీనివాసు లు, కొట్టం మాలిక్బాషా, పట్టణ మాజీ అధ్యక్షులు బొమ్మా మోహన్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ నల్లబోతుల శ్రీనివాసులు, నాయకులు సుంకప్ప, వెంకటరమణ, తిమ్మప్ప, శేఖర్, చీమల రాము, వన్నూరు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆపస్ నేతలు

అనంతపురం సిటీ మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అనంతపురం జిల్లా తరపున వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ నీ మర్యాదపూర్వకంగా కలిగి స్వామి వివేకానంద చిత్రపటం ఇచ్చి అభినందనలు తెలుపడం జరిగినది. అదేవిధంగా వివిధ ఉపాధ్యాయ సమస్యల మీద మంత్రికి విన్నవించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సలహాదారులు వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బి.రాజేంద్రప్రసాద్ అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రి స్వామి, కోశాధికారి రాఘవేంద్ర గుప్తా, ఉపాధ్యక్షులు హర్షవర్ధన్, నరహరి ,దొనస్వామి,వరదరాజులు , రమేష్, విజయభాస్కర్, సీనియర్ నాయకులు భాస్కరయ్య, ఉమామహేశ్వర తదితర ఉపాధ్యాయులు పాల్గొనడం



# డ్యూటీకి డుమ్మా!!

**అనంతపురం, మేజర్ న్యూస్ :** అనంతలో చుట్టపు చుపుగా విధులు, సొంత జిల్లా కర్నూల్ లో కాలక్షేపపు విధులు చేపడుతూనే పని చేసే 108 సిబ్బందికి లేని ఇబ్బందులు కలిగిస్తున్నాడని తెలిసిం ది. సేవా విభాగానికి చెందిన ఈ విభాగంపై జిల్లా ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేక ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఆ శాఖలోని ఉద్యోగుల పరిస్థితి తయారైంది. ఆ సిబ్బంది జిల్లాలో పై స్థాయి అధికారి ఓఈకి మాత్రం అడగలేని పరిస్థితి. ఆ శాఖలోని సిబ్బంది సమస్యలు ఎవరికైనా చెప్పాలంటే ఆయన వచ్చినప్పుడు మాత్రమే ఆయనకు సమయం ఉన్నప్పుడు మాత్రమే చెప్పాల్సి ఉంటుందని పలువురు ఆవేదన చెందుతున్నారు.నాడు ఫుల్ ఎంజాయ్మెంట్ నేడు డ్యూటీకే డుమ్మా! ఈ అధికారి ఆ శాఖలో సీమ అధికారిగా ఉన్న కారణంగా తనను ఎవరు ఏమి చేయలేరనే అహంతో విర్రవీగుతున్నాడనీ తెలిసింది. గతంలోనూ సీములోని పలు జిల్లాల అధికారులను ఆయన గుప్పెట్లో పెట్టుకుని చేయ కూడని పనులు చేశాడని తెలిసింది. ఇటీవల ఓ అధికారి కృష్ణ లీలలు వెలుగులోకి రావడంతో నిర్ధాక్షణంగా ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. అయితే సస్పెండ్ అయిన ఈ అధికారికి ఆ పై రెడ్డి అధికారికి ఉన్న సంబంధాలు అన్ని ఇన్నీ కాదని లిక్కర్,మగువ, విదేశీ యాత్రలతో ఫుల్ ఎంజాయ్ చేసే వారిని తెలిసింది. అయితే మనము ఒకటి తలిస్తే దైవం ఒకటి తెలుస్తుంది అన్నట్లుగా అనంతలోని ఆ కృష్ణ లీలలు బయటపడడంతో ఆయనను జిల్లా అధికారులు నిర్ధాక్షణంగా సస్పెండ్ చేశారు.

దీంతో ఆపై రెడ్డి అధికారికి ఎంజాయ్మెంట్ కాస్త తగ్గి ప్రస్తుతం డ్యూటీ కి డుమ్మా కొడుతున్నారని తెలిసింది. సొంత జిల్లా ఇరుగుపొరుగు జిల్లాలతో పాటు అనంతలో కూడా ఇష్టం వచ్చినపుడు పర్యటన పేరుతో పరిశీలిస్తూ మిగతా సమయాన్ని తన వ్యక్తిగతం కోసం వాడుకుంటున్నారని తెలిసింది. నిజంగా ఆ శాఖ జిల్లా ఉన్నత అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఈ 108 సేవపూరితమైన శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, విధులకు డుమ్మా కొడుతున్న ఆపై అధికారిపై విచారణకు ఆదేశించి కఠినంగా ప్రభుత్వ ఉన్నత రాష్ట్ర అధికారుల శిక్షించాలని పలువురు అదే శాఖ ఉద్యోగులు కోరుకుంటున్నారు. మరో కథనంలో సేవకు సంబంధించిన విభాగంలో ఈయన చేస్తున్న యవ్వారాలు ఒక్కొక్కటి మేజర్ న్యూస్ బహిర్గతం చేస్తుందని పాఠకులకు తెలియజేస్తున్నాం.

## నామినేటెడ్ పదవుల్లో జనసేనకు సముచిత స్థానం కల్పించాలి..

### – కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి.. – కాపు విద్యార్థులకు విదేశీ విద్య పథకం అమలులోకి తేవాలి...
### – కాపు బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కాశెట్టి సంజీవరాయుడు

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలో ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో జనసేన నాయకులకు, వీర మహిళలకు సముచిత స్థానం కల్పించాలని అనంతపురం జిల్లా కాపు బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు కాశెట్టి సంజీవరాయుడు కోరారు. మంగళవారం నగరంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో కాశెట్టి సంజీవరాయుడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నూతన ప్రభుత్వ పరిపాలన వ్యవహారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్‌లు తీసుకుంటున్న నిర్ణయాలు శుభపరిణామమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫోటోతోపాటు డిప్యూటీ సీఎం ఫోటో ఉంచాలనడం పట్ల ముఖ్యమం త్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇన్నాళ్లకు బలిజ, కాపు, తెలగ, ఒంటరి కులాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కినందుకు కాపు జాతి సంతోషం వ్యక్తం చేస్తోంద॑న్నారు. ఇదిలా ఉండగా.. కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాల చిరకాల కోరికైన 5 శాతం వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు (బీసీ రిజర్వేషన్) కొన్నేళ్లుగా పెండింగ్ లో ఉన్నాయన్నారు. కావున దీనిని



త్వరితగతిన చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్నామన్నారు. కాపు విద్యార్థులకు విదేశీ విద్య పథకాన్ని సత్వరం అమలులోకి తేవాలని కోరారు. కాపు కార్పొరేషన్ నిధులను సక్రమంగా సద్వినియోగపరచేలా రాయలసీమ బలిజ సామాజిక వర్గ నాయకున్ని నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బలిజ నేతలు, జనసేన నాయకులు పేరూరు శ్రీనివాసులు, వెన్నెల కృష్ణ, బండమీదపల్లి గోపాల్, జనసేన అనంతపురం నగర ఉపాధ్యక్షులు గ్రంథి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, జనసేన నాయకులు తోట ప్రకాష్, మనేరి సురేష్, రామాంజనేయులు, మధు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యయ ఖర్చు తుది అకౌంట్స్ 3వ తేదీలోపు సమర్పించాలి

### – ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే, నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే

అనంతపురం మేజర్ న్యూస్ :అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎక్స్పెండిచర్ మానిటరింగ్ టీంతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ తో కలిసి అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గంకు సంబంధించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే ఐ.ఆర్.ఎస్ (సీనియర్ అధికారి), జిల్లాలోని రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్ ఐ.ఆర్.ఎస్, జిల్లాలోని అనంతపురం అర్బన్, రాప్తాడు, సింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు రాందాస్ టి.కాలే, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే, నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే మాట్లాడుతూ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యయ ఖర్చుకు సంబంధించిన తుది అకౌంట్స్ ఈనెల 3వతేదీలోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. 03.07.2024 తేదీ నాటికి అందరూ అభ్యర్థులు కూడా ఎన్నికల అంతిమ లెక్కలను డీఈవోకి సమర్పించాలని, లేనిచో వారు డిస్క్ క్వాలిఫై అవుతారన్నారు. ఇప్పటివరకు సమర్పించిన వారి తుది అకౌంట్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుది అకౌంట్స్ సమర్పించని వారిని పిలిపించుకుని తుది అకౌంట్స్ సమర్పించాలని వారికి తెలియజేయాలన్నారు. ఈనెల మూడో తేదీన సాయంత్రం 5 గంటల లోపల అంతిమ నివేదికలను, లెక్కచారాలను, తుది అకౌంట్స్ ను సమర్పించాలన్నారు.ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమ నామినేషన్ తేదీ నుంచి ఎన్నికల ఫలితాల తేదీ వరకు ఖర్చు చేసిన వివరాలకు సంబంధించిన నివేదిక, ఎక్స్పెండిచర్ డీటెయిల్స్, అన్ని ఖర్చుల వివరాలు, బిల్లులు, ఓచర్లు, అఫిడవిట్స్, బ్యాంకు పుస్తకాలు, ఎబిసి రిజిస్టర్లు ఖచ్చితంగా సరిచూసుకొని అభ్యర్థి సంతకంతో జులై 3వ తేదీలోగా సమర్పించాలన్నారు. తుది అకౌంట్స్ సమర్పించని వారిని పిలిపించుకోవాలని, తుది అకౌంట్స్ ని ఈనెల 3వ తేదీ లోపల సమర్పించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిసిఒ అరుణకుమారి, టూరిజం ఆర్డీ వెంకటేశ్వర్లు, జిల్లా ఎక్స్పెండిచర్ మానిటరింగ్ టీం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములపై చర్యలు తీసుకోండి



పుట్టపర్తి రూరల్ మేజర్ న్యూస్ : పుట్టపర్తి నియోజకవర్గం పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోభూములు అన్యక్రాంతము జరిగిన వాటిపై వెంటనే మున్సిపల్ కమిషనర్ ని చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడం జరిగింది అదేవిధంగా పుట్టపర్తిలో మొట్టమొదటి పండుగ అనేది గురు పౌర్ణమి తో ప్రారంభం జరుగును వచ్చిన భక్తులకు వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థ పారిశుద్ధ్యం గురించి జనసేన పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కి వివరించడం జరిగింది కమిషనర్ ఇచ్చిన అర్జీపై స్పందిస్తూ మున్సిపాలిటీ సిబ్బందికి వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి మున్సిపాలిటీ భూములు పై ఆక్రమించిన వారికి వెంటనే నోటీసులు ఇవ్వమని సిబ్బందికి చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బొగ్గరం శ్రీనివాసులు టౌన్ ఉపాధ్యక్షులు మారుతి టౌన్ ప్రధాన కార్యదర్శి రాము కార్యదర్శి గణేష్ పాల్గొనడం జరిగింది

## తాడిపత్రి క్రీడాకారుడు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక



తాడిపత్రి మేజర్ న్యూస్: తాడిపత్రి ఆర్డీటి క్రికెట్ క్యాంపుకు చెందిన మహమ్మద్ షా తమీం -16 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు కోచ్ భార్గవ్ మంగళవారం తెలిపారు. జులై 2 నుంచి 20 వరకు విజయనగరంలో జరిగే అంతర్ జిల్లా టోర్నమెంట్లో పాల్గొంటున్నాడు. ఎంపిక పట్ల లలిత, సీనియర్ కోచ్ సాదిక్ వలి, సీనియర్ క్రీడాకారులు క్రికెట్ కోచ్ భార్గవ్ హర్షం వ్యక్తం చేశారు.

# వైద్యులు క్రీడలతో మానసిక ఒత్తిడిని అధిగమించాలి..






- వికాస్ భారత్‌స్పోర్ట్ ఫెస్ట్-2024ను ప్రారంభించిన ఎమ్మెల్యే
- క్రికెట్ బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- వైద్యులతో కలసి సరదాగా క్రీడల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడేది వైద్యులని.. అయితే వారికి కూడా విధి నిర్వహణలో మానసిక ఒత్తిడి ఉంటుందని.. వారికి కూడా క్రీడలు అవసరమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని పీటీసీ మైదానంలో వికాస్ భారత్ స్పోర్ట్ ఫెస్ట్-2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యాధికారులు, ఇతర ప్రముఖులు, టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి క్రికెట్ ఆడి.. అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ.. క్రీడలతోనే మానసిక ఉల్లాసం కల్గుతుందన్నారు. ఈ క్రీడలు సుమారు నెల రోజులకు పైగా జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయిలో ఆడటానికి ప్రభుత్వ అసుపత్రి నుంచి ఓ క్రికెట్ జట్టును ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. క్రీడలు ప్రోత్సహించేందుకు ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ వెంకటేశ్వరరావు, ఆర్.ఎం.ఓ డాక్టర్ హేమలత, డాక్టర్లు ప్రవీణ్, వరదరాజులు, శంకర్ నారాయణ, సునీత, రజిత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళావాయి వెంకట నారాయణ, టిఎన్టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్, టిఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మినరసింహులు, బిసి సెల్ నగర అధ్యక్షుడు సిమెంట్ పోలన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరిప్రసాద్, టిడిపి నాయకులు, వైద్య సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

## ధర్మవరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే కర్తవ్యం

### - మంత్రి సత్య కుమార్ యాదవ్ -అన్నిశాఖల అధికారులతో సమీక్ష

**ధర్మవరం మేజర్ న్యూస్ :** అన్నిశాఖల సహకారంతో ధర్మవరాన్ని ఆదర్శవవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి నా వంతు కృషిచేస్తానని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖమంత్రిసత్యకుమార్యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...నియోజకవర్గంలో 6వేల మంది అంగవైకల్యంతో బాధపడుతున్నారని అదే విధంగా పక్షపాతాన్ని కూడా నిర్మూలించడానికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారిణి మంజులవాణిని ఆదేశించారు త్వరలో శాఖల వారీగా సమీక్షించడం జరుగుతుందని, ప్రతి శాఖలో ప్రజలకు ఏవిధంగా మీ శాఖలు ఉపయోగపడుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే వివిద సం క్షేమపథకాలు ఎలాఅమలు చేస్తున్నారో వాటిపై పూర్తీ స్థాయి నివేదిక సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ఈనెల 9 నుంచి 11వతేదీ వరకు సంబంధిత శాఖ అదికారులతో నియోజకవర అభివృద్ధిపై సమీక నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఆ సమావేశానికి దీర్ఘకాలిక సంబంధించిన సమస్యలు, త్వరగాపరిష్కరించల్సిన సమస్యలను మూడు నెలల్లో పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తించి నివేధించాలన్నారు. నీటి సమస్య ఎక్కడ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వచ్చిన నిధులు ఏ విధంగా ఖర్చుచేస్తున్నారు.. సమగ్రనివేధికలు సిద్ధంచేయాలన్నారు. బత్తలపల్లి మండలం డిచెర్లోపల్లిలో కేంద్ర ప్రభుత్వం 15 ఆర్థికసంఘం నిధులు మంజూరు చేస్తే కేవలం రూ.2693 మాత్రమే ఖర్చు పెట్టారన్నారు. అధికారులు మీ శాఖలపై పూర్తీ అవగాహన ఉండాలన్నారు. మంచి పనులు చేయాలంటే మీ అభిప్రాయం తెలుసుకొని వాటిని అమలుచేయడానికి సిద్ధంగా ఉంటానన్నారు. రెండు నెలలో ఇక్కడ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నదే తన ముందున్న కర్తవ్యమన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ, నీరు, విద్యుత్ సమస్యలతోపాటు గృహనిర్మాణాలు ఇంటి సమస్యల పరిష్కారానికి మీరందరు నాతోకలసి నడవాలన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి సం క్షేమఫలాలు అందజేయాల్సిన బాధ్యత మీపై ఉంటుందన్నారు. కేంద్రం నుంచి సివియర్ యాక్టివిటీస్ పైన కేంద్రంతో పోరాడి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో నేతన్నలు అధికంగా ఉన్నారని వారిని అబివృద్ధి చేయడానికి, కేంద్రం నుంచి అధిక మొత్తంలో నిదులు మంజూరుకు నా వంతు కృషిచేస్తానని, అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, డీఎం అండెచిడాక్టర్ మంజులవాణి, విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ జిల్లా ఏడీ రమేశ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కదిరిలో వైసీపీ నాయకుల ఆక్రమణలు కూల్చివేత

- రూ.కోట్లువిలువ చేసే భూములలో వైసీపీ నాయకుల అక్రమ పునాదులు నిర్మాణాలు కూల్చివేత
- ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకొనే దిశగా అధికారులు - వైసీపీ నాయకుల భూ దందాలకు అడ్డుకట్ట
- వైసీపీ నాయకులలో మొదలైన వణుకు - రెండు రోజులలో మరిన్ని భూ ఆక్రమణల తొలగింపులు ?



అడపాలవీధిలో ఆక్రమణలను జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం



బైపాస్ రోడ్డులో ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం

కదిరిటౌన్, మేజర్‌న్యూస్ : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కదిరి పట్టణంలోని నడి బొడ్డున ఉన్న ప్రభుత్వ భూములలో కొందరు వైసీపీ నాయకులు కోట్ల విలువ చేసే భూములను ఆక్రమించుకొని, పునాదులు, రేకుల షెడ్‌లను సైతం నిర్మించుకొన్నారు. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావడం, ప్రభుత్వ భూములను ఆక్రమించుకొన్న వైసీపీ నాయకులలో వణుకు మొదలైంది. మంగళవారం కదిరి పట్టణంలో వైసీపీ నాయకులు భూ దందా, ఆక్రమణలపై అధికారులు కూల్చివేతలు చేపట్టారు. పట్టణంలోని అడపాల వీధిలోని సర్వే నెంబరు 206 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకుడు ఆక్రమించుకొని షెడ్‌ను సైతం నిర్మించుకోగా, జేసీబీతో ఆ షెడ్‌ను కూల్చివేయడం జరిగింది. అలాగే బైపాస్ రోడ్డు పక్కన కోట్లాది రూపాయలు విలువ చేసే సర్వే నెంబరు 1738లో వైసీపీ నాయకులు ఆక్రమించి పునాదులు నిర్మించిన వాటిని తొలగింప చేశారు.అలాగే పట్టణంలో పలు చోట్ల ప్రభుత్వ స్థలాలలో పునాదులు నిర్మించగా వాటిని సైతం అధికారులు కూల్చివేయడం జరిగింది. గతంలో కోట్ల విలువ చేసే భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకొని, దర్జాగా వాటిని ఇతరులకు విక్రయించేందుకు ఆ నాయకులు సిద్దమయ్యారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైన వాటిని వెంటనే స్వాధీనం చేసుకొనే దిశగా అధికారులు కూల్చివేతలు చేపడుతున్నారు. అంతే కాకుండా ఇప్పటి వరకు వైసీపీ నాయకులు ఆక్రమించుకొన్న ప్రతి సెంటు భూమి స్వాధీనం చేసుకొనే దిశగా ఈ కూల్చివేతలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. అధికారుల చేపట్టిన కూల్చివేతల చర్యలతో వైసీపీ నాయకులు గుండెల్లో వణుకు మొదలైంది. అలాగే కదిరి పట్టణ నలువైపులా ఎక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమించుకొన్నా, వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు వాటిలో నిర్మించిన పునాదుల కూల్చివేతలు ఖాయమని పట్టణంలో చర్చ జరుగుతోంది. ఐదేళ్ల పాటు వైసీపీ నాయకులు అనేక చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడం జరిగింది. ఈ చర్యలతో వైసీపీ నాయకులు వణుకు మొదలు కాగా.. కదిరి పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నిప్పంటించుకుని యువకుడు ఆత్మహత్య



అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో ఉన్న జొన్న ఐరన్ మార్ట్ సమీపంలో నిప్పంటించుకొని నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు క చెందిన వాసు దత్త (23) మంగళవారం సాయంత్రం పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న సంఘటన చోటుచేసుకుంది. మనస్థాపంతో ఒక్కసారిగా నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు అతనిని హుటాహుటిన అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అత్యవసర వైద్య విభాగంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# సమస్యల పరిష్కారంలో అధికారుల కృషి మరింత అవసరం

**- మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారుల కృషి మరింత అవసరం ఉందని, ప్రతి విభాగానికి చెందిన అధికారి కౌన్సిలర్లకు సహాయ సహకారాలు అందించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆఫీసులో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో అజెండాకు సంబంధించిన అంశాలపై చర్చించి, కౌన్సిలర్ ద్వారా తీర్మానాన్ని ఆమోదింప చేశారు. అనంతరం పట్టణంలోని వారు సమస్యలపై వైస్ చైర్మన్ జయరామిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో అభివృద్ధి పనుల విషయంలో అధికారుల చెరువ మరింత ఉండాలని, అధికారులు కౌన్సిలర్లు సమన్వయ ముతోనే పట్టణ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడడం పట్ల శుభాకాంక్షలు తెలియజేశారు. కలిసికట్టుగా అధికారులు, కౌన్సిలర్లు ప్రజా సమస్యల పరిష్కారానికై సహకరించాలని తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులలో రజకులకు దోబీ ఘాట్ సమస్య అధికంగా ఉందని, త్వరితగతిన ధోబి గాట్లను ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. అదేవిధంగా రోడ్ల డివైడర్ లో మొక్కలు పూర్తిగా ఎండిపోవడం జరిగిందని, సకాలంలో నీరు పెట్టకపోవడంతో ప్రజల సొమ్ము వృధా అయిందని వాపోయారు. అదేవిధంగా నీటిని కూడా వృధా చేయడం మంచిది కాదని సూచించారు. డివైడర్ మధ్యలో గల ఎండిపోయిన చెట్లను తొలగించి, కొత్త మొక్కలను నాటాలని తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత కృషి చేస్తే గాని పట్టణం అభివృద్ధి చెందదు అని తెలిపారు. పట్టణంలో ఏ పని జరిగిన కనీసం కౌన్సిలర్లకు సమాచారం అందించాలని తెలిపారు. అంతేకాకుండా వీధిలైట్ల సమస్య ఆనాటి నుండి నేటి వరకు అలాగే ఉండిపోయిందని, ఆ సమస్యను పరిష్కరించాలని వారు తెలిపారు. ప్రస్తుత నూతన ప్రభుత్వం పెన్షన్ పంపిణీ చేపట్టడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ లు జయరామ్ రెడ్డి, శంషాద్ బేగం, వార్డు కౌన్సిలర్లు,ఇంజనీరింగ్ ఈఈ .సత్యనారాయణ, ఇంజనీరింగ్ ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు అరికడదాం... ఆడబిడ్డలను కాపాడుదాం

**- సిడిపిఓ శాంతలక్ష్మి**



**రొద్దం, మేజర్ న్యూస్** మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో మంగళవారం ఆర్‌డిటి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బాల్య వివాహాలు అరికడదాం - ఆడబిడ్డలను కాపాడుదాం" అనే కార్యక్రమం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మాయిలకు లఘుచిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురైయ్యే సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలి (బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు) అనే విషయాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెనుకొండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారిని శాంతలక్ష్మి, ఆర్‌డిటి మడకశిర రిజినల్ డైరెక్టర్ మల్లికార్జున, తహసిల్దార్ లక్ష్మి నారాయణ, వైద్యాధికారిని భాగ్యలక్ష్మి, విచ్చేయడం జరిగింది. పెనుకొండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారిని శాంతలక్ష్మి మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారీరక ఒత్తిడికి గురి కావడం మరియు ప్రసవ సమయంలో తల్లి బిడ్డ ప్రాణాలు కోల్పోతారని బాల్య వివాహం చేసుకున్న, నిర్వహించిన, సహకరించిన వారు శిక్షార్హులు అనితెలిపారు. ఆర్‌డిటి మడకశిర రిజినల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్రరూపం దాల్చిందని బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ, వైద్య సిబ్బంది అనుష, మహిళా పోలీస్ నాగలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు మరియు చిన్నారులు పాల్గొన్నారు.

# 25వ వార్డులో పింఛన్ల పంపిణీ



ధర్మవరం మేజర్ న్యూస్ పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలోని 25వ వార్డులో టీడీపీపట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, ఆ వార్డు ఇన్చార్జ్ భీమనేని ప్రసాద్ నాయుడు మంగళవారం పంపిణీచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు పింఛన్లను అందిస్తున్నారన్నారు. మిగిలిన పథకాలను కూడా ఒక్కొక్కటికిగా అమలు చేస్తారన్నారు. ప్రజలఅభివృద్ధి కోసం సీఎం ఆహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు.గత ప్రభుత్వంలో పించన్ ను పెం చామని గొప్పల చెప్పి ఏడాదికి రూ.250 మాత్రమే పెంచారన్నారు. అయితే చం ద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఒక్కసారిగా రూ.4వేలు పింఛను అందిసు న్నారన్నారు.ముందుగా దేశంలో సామాజిక భద్రతా పింఛన్ అమలు చేసిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్ కే దక్కుతుందన్నారు.

# 4వ తేదీ విద్యాసంస్థలు బంద్

**- ఐక్య విద్యార్థి సంఘం నాయకులు**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా నెలకొన్న విద్యా సమస్యలపై ఈ నెల నాలుగవ తేదీన విద్యాసంస్థల బందును నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దామోదర్, ఏఐఎస్బి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య, ఏపీ ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి శివ గౌడ్, పి ఎస్ యు డివిజన్ అధ్యక్షుడు నందకిషోర్, ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షులు గణేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని పి.హెచ్.డి అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరిగా నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని వారు తెలిపారు. టి ఐ ఎస్ ఎస్ ముంబై, ఐఐటి ముంబై నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు నిర్బంధాలు తొలగించాలని, యూనివర్సిటీలో స్వేచ్ఛ వక్రీకరణ ప్రజాస్వామ్య అనిచివేత చర్యలను వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలనే పలు విషయాలపై రామయ్య నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. మా సమస్యలు పరిష్కరించకపోతే ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బంద్ నిర్వహిస్తున్నట్లు వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ బి నాయకులు నందకిషోర్, పురుషోత్తం, సునీల్, సాయికుమార్, గణేష్, రాజు, ప్రమోద్, నారాయణస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

# మా గ్రామానికి ఆసుపత్రి కావాలి..

**-మంత్రి సత్యకుమార్‌కు వినతి**



**రామగిరి మేజర్ న్యూస్:** మంగళవారం వెంకటాపురం గ్రామానికి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కు గ్రామస్థులు ఆసుపత్రి కావాలంటూ వినతి పత్రం అందజేశారు. తమ గ్రామానికి సమీపంలో ఉన్న నసనకోటలో ఆసుపత్రి ఉన్నా.. అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదన్నారు. వైద్యం కోసం ఎటుచూసినా 15కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అందుకే తమ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ఇక్కడ ఆసుపత్రి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని సత్యకుమార్ హామీ ఇచ్చారు.

# ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన అధికారిణి



**బత్తలపల్లి మేజర్ న్యూస్ :** తెదేపా ప్రభుత్వం వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో బత్తలపల్లి మండలం ఓబులాపురం పంచాయతీ కోడేకండ్ల గ్రామంలో స్థానిక ఏఎన్ఎం భారతికి అప్పగించారు అధికారులు జులై 1న లబ్ధిదారులందరికీ పంపిణీ చేసింది అయితే టీ. సరోజమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యానికి గురి కావడంతో అనంతపురం ఆసుపత్రిలో చికిత్సలు పొందుతుండగా మంగళవారం అక్కడికి వెళ్లి పింఛన్ పంపిణీ చేయడంతో వృద్యురాలతో పాటు కుటుంబ సభ్యులు ఆమెను అభినందించారు. ఎంతో శ్రమ తీసుకుని పింఛన్ ఆసుపత్రికే వెళ్లి పంపిణీ చేయడం అభినందనీయమని గ్రామస్తులు, పంచాయతీ అధికారులు పేర్కొన్నారు.

# గొట్లూరు గ్రామంలో శ్రీకృష్ణదేవరాయలు వారి విగ్రహానికి స్థలం కేటాయించండి

**- బలిజ సంఘం వారి విన్నపం**




**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గోట్లూరు గ్రామంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ప్రతిష్ట చేయడానికి గ్రామములో స్థలమును కేటాయించాలని కోరుతూ గ్రామ బలిజ సంఘం వారు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మా గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర పాత అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుందని కావున అది తొలగించి ఆ స్థలాన్ని శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టకు అనుమతించాలని వారు కోరారు. స్పందించిన చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకుని వెళ్లి, వారితో చర్చించి, మీకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పెన్షన్ పెంపు పట్ల హర్షం

**- శ్రీ సాయి ధర్మాంబా దివ్యాంగుల సంక్షేమ సంఘం**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** ఇటీవల ఎన్డీఏ రాష్ట్ర ప్రభుత్వం అందించిన దివ్యాంగుల పింఛన్ పెంపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 18 వ వార్డు గాంధీనగర్లో శ్రీ సాయి ధర్మాంబా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు లలిత ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ సంతోషాన్ని పంచుకుంటూ ముఖ్యమంత్రి కి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లలిత మాట్లాడుతూ దివ్యాంగుల పెన్షన్ 3000 రూపాయల నుంచి 6 వేల రూపాయలకు పెంచడం దివ్యాంగులకు ఎంతో వరంగా మారిందని, వారి జీవనాభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా దివ్యాంగుల సమస్యలను కూడా పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి మాకు న్యాయం చేయాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో 18 వార్డు టిడిపి ఇన్చార్జ్ కత్తుల బాబ్జి, నాగరాజు, నిర్మల, నల్లప్ప, కరిష్మా ,టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో వైజ్ఞానిక శిక్షణ కార్యక్రమం

ఓబులదేవరచెరువు, మేజర్ న్యూస్ : మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ లో సిఐటియు ఆధ్వర్యం లో మంగళవారం విద్యా వైజ్ఞానిక అవగాహన శిక్షణ తరగతులను నిర్వ హించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా వివి రమణ జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీ నారాయణ అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. సందర్భంగా క్లాసులు టీచర్లుగా సిఐటియురాష్ట్ర ఉపాధ్య క్షులు ఓబులు, సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంక టేష్ అవగాహన కల్పిం చారు. వారు మాట్లాడు తూ సిఐటియు ఆధ్వర్యంలో పోరా టాలు చేశామన్నారు. భవనిర్మాణ కార్మికులు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి సంక్షేమ బోర్డు ఏర్పా టు చేయాలి, ఇన్సూ రెన్స్ సౌకర్యం కల్పిం చడం తో పాటు, మృతి చెందిన కార్మికుల కుటుంబంలో వారికి ఇన్సూరెన్స్ కార్ సౌక ర్యం కల్పించి వాళ్ల కుటుంబాన్ని ఆదుకో వాలన్నారు. అంగ న్వాడీ , ఆశ కార్మికు లకు పంచాయతీ కార్మికులకు ఉద్యోగ ప్రభుత్వ ఉద్యోగ స్తులుగా గుర్తించి సమాన పనికి సమాన వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని గ్రావిటీ ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్. సౌకర్యం కల్పించాలని స్వచ్ఛ భారత్ కార్మికులు పంచాయతీ కార్మికు లకు సన్మాన పనికి సమాన వేతనం కనీసం 26,000 వేలు. అమలు చేయాల న్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినటు



వంటి హామీలు అమ లు చేయాలి లేబర్ చట్టాల అమలు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు చేపడ తామన్నారు. ఈ కార్య క్రమంలో మండల అధ్యక్షులు కుల్లాయప్ప కార్యదర్శి శ్రీరా ములు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గంగాధర, బాబా, వేమన్న, భవనని ర్మాణ కార్మిక సంఘం నాయకులు సూరి, సురేంద్ర, శ్రీనివాసులు, మహేంద్ర, గంగులప్ప, నాగరాజు, ఇతర కార్మికులు పాల్గొనడం జరిగింది అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్లు సెక్టార్ లీడర్లు రంగమ్మ, ఆశీర్వదమ్మ, కిష్టమ్మ, ఆదిలక్ష్మి, సుజాత, ఉమాదేవి, సునీత, గంగాదేవి, పద్మావతి, స్వర్ణ, వరలక్ష్మి, నాగరత్నమ్మ, మణి మాల, సునీత, స్వచ్ఛభారత్ కార్మి కులు రమేష్, రమణమ్మ, గంగు లమ్మ, మహిళా సంఘం నాయకురాలు కాంతమ్మ, కళావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బాసంవారిపల్లిలో టిడిపి నాయకుల సంబరాలు



నల్లమాడ, మేజర్ న్యూస్ : మండలంలోని బాసం వారిపల్లికి చెందిన తెలుగు దేశం నాయ కులు శ్రీనివా సులు, విష్ణువర్ధన్, చిన్న వెంకటరాముడు ఆధ్వర్యం లో గ్రామంలో సంబరాలు నిర్వహించారు. ఈ సం దర్భంగా టిడిపి నాయకులు పింఛన్ దారులతో కలిసి కేక్ కట్ చేసి నాయకులకు గ్రామ ప్రజలకు పంచి పెట్టా రు. నాయకులు మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటిం చిన రూ. 4000 పింఛన్ తో పాటు అదనంగా మూడు నెలలకు మరోవైపు 1000 చొప్పున పింఛన్లు పంపిణీ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా నే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, టిడిపి ఇన్చార్జ్ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలకు పింఛన్దారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి. శ్రీనివాసులు, కె చిన్న వెంకట రాముడు, డాక్టర్ బుట్టి నాగ భూషణ్ నాయుడు, బాసం విష్ణువర్ధన్ రెడ్డి , కిరణ్ కుమార్ రెడ్డి , కె నారాయణ, పెద్ద వెంకట్ రాముడు, కే. శ్రీనివాసులు ,చాంద్ బాషా ఎం.శ్రీని వాసు లు, కే.ఆదినారాయణ, కే పెద్ద వెంకటష్, కే చిన్న వెంకటేశు, తెలుగుదేశం నాయ కులు, కార్యకర్తలు, నాయ కులు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



అమడగూరు, మేజర్ న్యూస్ : అమడుగూరుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులలో టాప్ 5 విద్యార్థులకు నగదు బహుమతిని మంగళవారం రమణ దంపతులు తన కుమార్తె పావని జ్ఞాపకార్థం అందజేశారు. ఈ కార్యక్రమా న్ని ఉద్దేశించి మాట్లాడిన ప్రధానోపా ధ్యాయులు శ్రీధర్ బాబు మాట్లాడుతూ రమణ కుమార్తె పావని ఆత్మకు శాంతి కలగా లని దేవుడిని ప్రార్థించారు.ఈ విధంగా మా పిల్లలను ప్రోత్సాహ కాన్ని ఇచ్చి ప్రోత్సహించినందుకు ఆ దంపతులకు పాఠశాల తరుపున అభినంద నలు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థుల పేర్లు వారికి ఇచ్చిన బహుమతులు చందు 590(5000), ఆశ 580 (4000) , రితిక 569 (3000), ఇందు 527 (2000), సుహేల్ ఖాన్ 512 (1000), శృతి 512(1000) ఈ బహు మతులను అందు కొన్నారు. కార్యక్రమం లో ఉపా ధ్యాయులు విజయ దేవ రెడ్డి, జాఫర్, సహదేవరెడ్డి, ఈశ్వర్ ,రామ్మోహన్ ,శ్రీనివాస్ రెడ్డి, సాయి సుధా, అనిత ,నిర్మల దేవ కుమారి , ఖాదర్ వలీ బెగ్ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించినందుకు విద్యార్థులకు ప్రోత్సా హాకాన్ని ఇచ్చినందుకు రమణా దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఐచర్ వాహనం ఢీ కొని ద్వీచక్ర వాహన దారుడు మృతి

తలుపుల, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని పల్లావాండ్లపల్లి, బైగారి పల్లి గ్రామాల సమీపా న ఉన్న జియో టవర్ లో పనిచేస్తున్న కదిరికి చెందిన శేషాద్రి (23) మంగళవారం విధులు ముగించుకొని ఓబుళ రెడ్డి పల్లి నుంచి తలు పులకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం ఢీ కొనడం జరిగింది. తీవ్రంగా



గాయపడిన శేషాద్రిని చుట్టు పక్కల గ్రామాల వాసులు తలుపులకు తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం కదిరి ప్రభు త్వ ఆసుపత్రికి తరలిం చినట్లు ఎస్సై దిలీప్ కుమార్ తెలిపారు.

# నీట్ పరీక్షను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలి

## - 4న విద్యా సంస్థల బంద్ - ఏఐఎస్ఎఫ్,ఎస్ ఎఫ్ ఐ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్ యుఐ నాయకులు

కదిరి, మేజర్ న్యూస్ : నీట్ పరీక్ష ఫలితాలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరి పించి, నీట్ పరీక్షలు రద్దు చేసి ఎస్ టి ఏ సమస్యను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ చేపట్ట డం జరుగుతోందని ఏఐఎస్ ఎఫ్,ఎస్ ఎఫ్ ఐ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్ యుఐ నాయకులు పేర్కొన్నారు. బంద్ కు సంబంధించిన కరప త్రాలను మంగళవారం కదిరి పట్టణంలో జూనియర్ కళాశాల లో నాయకులు ఆవిష్క రించారు. నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాలలో పేపర్ లీకేజ్ జరిగిం దని, వెంటనే పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ చేసి దోషులగా ఉన్న వారు ఒక్కో విద్యార్థి నుంచి 40 లక్షల వరకు వసూ లు చేశారని ఆరోపణ లు వినిపిస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. వైద్య విద్యను వ్యాపారంగా మార్చే విధంగా నీట్ పరీక్షల్లో పేపర్ లీకేజ్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందిం చి నీట్ పరీక్షలు రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా



సమస్యపై చేపడుతు న్న బంద్ ను కదిరి పట్టణంలో సైతం నిర్వహించడం జరుగు తోందని విద్యాసంస్థలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పవన్, జిల్లా ఉపాధ్య క్షులు శేషం మహేంద్ర, ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయ కులు విజయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహ, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు గాలివీడు ఉపేంద్ర, జాతీయ విద్యార్థి సంఘాల నాయకులు బన్నీ, సాయి, రాము, మనోజ్, వినీత్ , చైతన్య, విజయ్ తదితరులు పాల్గొ న్నారు.

# ఘనంగా జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పాస్టర్రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు 51వ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కృతజ్ఞత కూడిక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, పాస్టర్లు తరలివచ్చి నెహెమ్య నాగరాజుకు పుష్పగుచ్చాలు అంచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించారు. పాస్టర్ అబ్రహం, పాస్టర్ రూపస్ కుమార్ పాటలు పాడి దేవుని స్తుతించారు, పాస్టర్ జిఆర్ ఆనంద్ వాక్య పరిచర్య చేశారు. ఈ వేడుకల్లో వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పీ మార్కు, సెక్రటరీ పాస్టర్ జిఆర్ ఆనంద్ , జాయింట్ సెక్రెటరీ పాస్టర్ విమనషే, ట్రెజరర్ పాస్టర్ జీవన్ బాబు,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాస్టర్ రూఫస్ కుమార్, పాస్టర్ జహంగీర్ జాషువా, పాస్టర్ లాబాను సుధాకర్ పాల్గొన్నారు. పాస్టర్



సాల్మన్, పాస్టర్ అబ్రహం గుత్తి, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ నాయకులు పాస్టర్ వైపి బాబు, పాస్టర్ నవీన్ కుమార్, పాస్టర్ లీనా డేబోరా, సిస్టర్ రాణి ఎలిషా, బ్రదర్ రాజా, బ్రదర్ ద్వారక బ్రదర్ ప్రసాద్, యేసు కృపా మందిరం సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

## - బిజెపి జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్

తాడిపత్రి మేయర్ న్యూస్: లోకసభలో హిందువుల, హిందూ జాతి గురించి అవమానకరంగా సోమవారం మాట్లాడిన లోకసభ ప్రతి పక్ష నాయకుడు ఎంపీ రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, అదేవిధంగా రాహుల్ గాంధీ లోక్సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్ మంగళవారం సోషల్ మీడియా ముఖంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకసభ ప్రతి నేత నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజం పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరి ఏ విధంగా ఉందో, యూపీఏ కూటమికి హిందువులు అంటేఎంత గౌరవం ఉందో అర్థం అవుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో రెండుసార్లు ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిన, వేలాదిమంది సిక్కుల ఊచ గుతకు కారణమైన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్లో నీతులు చెప్పడం చూస్తుంటే దయ్యాలు



వేదాలు వల్లించినట్లుగా ఉంది అని అన్నారు .ప్రజలు ఎన్నుకొన్నది లోకసభలో ప్రజా సమస్యలు ప్రస్తావించడానికి కానీ హిందూ ధర్మాన్ని అగౌరపరచడానకా.. అని ప్రశ్నించారు . కానుక యావత్ హిందూ జాతి తీవ్రంగా వ్యతిరేస్తుంది అని అన్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాల కారణంగానే కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయింది అని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు ...లోక సభ ప్రతి పక్ష నాయకుడు ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను సమర్థించిన యూపీఏ కూటమి మిత్ర పక్షాలు కూడా ప్రజలకు హిందువులకు బహిరంగా క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు.

# రహదారి ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**– కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవ రెడ్డి**

పుట్టపర్తి మేజర్ న్యూస్: శ్రీ సత్య సాయి జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళ వారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి క్లయిమ్ సెటిల్మెంట్ కమిటీ మరియు రోడ్ సేఫ్టీ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి కరుణ సాగర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలలో మరణాల సంఖ్య తగ్గించలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపే వారిమీద కేసు నమోదు చేసి జైలు శిక్ష పడేట్టుచెయ్యాలన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే ప్రదేశాలను ఒక కమిటీ ద్వారా గుర్తించి తగు చర్యలు తీసుకోవలని



సూచించారు. హెల్మెట్ ధరించని వారిపై, మద్యం సేవించి వాహనాన్ని నడిపే వారిపై పోలీస్, రవాణా శాఖ సమన్వయము తో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ట్రామా కేర్ సెంటర్ లో మెడికల్ ఆఫీసర్ ను తక్షణమే నియమించాలన్నారు. పట్టణ, మున్సిపల్ పరిధిలోని రహదారులపై పడుకున్న లేక తిరుగుతున్న జంతువులు సురక్షితంగా ఉండేలా చూడాలన్నారు.జిల్లా విద్యాధికారి ద్వారా పాఠశాలల పిల్లల తల్లి దండ్రుల చేత సమావేశం నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకునేలా పాఠశాల యజమాన్యం కు తెలియజేయాలన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసే మోటార్ సైకిల్ వారికి చట్టాల గురించి తెలియ చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. నేషనల్ హైవే ల పైన రాష్ డ్రైవింగ్ మరియు అతి వేగంగా వాహనాలు నడిపెవారే ఎక్కువ ప్రమాదాలు చేస్తున్నారని, వారి పై కఠినంగా ఉండాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర నాయక్,డీఈఓ ఆఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు రంగస్వామి, కదిరి కిరణ్ కుమార్, పెనుగొండ వంశీకృష్ణ భార్గవ, ఆర్టీసీ జనరల్ మేనేజర్ మధుసూదన్ ల తోపాటు జిల్లా స్థాయి క్లయిమ్ సెటిల్మెంట్ కమిటీ మరియు రోడ్ సేఫ్టీ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

# ఓట్లు వేసిన ప్రజల్ని.. జెండా మోసిన కార్యకర్తల్ని మర్చిపోం

- పేరూరు ప్రాజెక్టుకు నీరిచ్చి మాట నిలబెట్టుకుంటాం
- తగరకుంట విజయోత్సవంలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్
- విజయోత్సవంలో పాల్గొన్న మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి
- పరిటాల శ్రీరామ్ ఇద్దరు ఎమ్మెల్యేల్ని గెలిపించారు.. పరిటాల సునీత
- రాక్షస పాలనను పాతాళానికి తొక్కేశారు.. మంత్రి సవిత
- ఎవరికీ అన్యాయం జరగనివ్వం.. ఎంపీ పార్థసారథి

**రాప్తాడు, మేజర్ న్యూస్:** మాపై నమ్మకంతో ఓట్లు వేసిన ప్రజలను, జెండా మోసిన కార్యకర్తలను ఎప్పటికీ మరువమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఎన్నికల్లో భారీ విజయం నేపథ్యంలో కనగానపల్లి మండలం తగరకుంటలో భారీ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి కురుబ సవిత, ఎంపీ పార్థసారథిలు పాల్గొన్నారు. వందలాది మంది కార్యకర్తలు, నాయకుల మధ్య ఊరేగింపు సాగింది. డప్పులు, ఈలలు, కేకలు, పూల వర్షం కురిపిస్తూ కార్యకర్తలు అభిమానం చాటుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన పరిణామాల గురించి మాట్లాడారు...

**పేరూరు ప్రాజెక్టుకు నీరు ఇస్తాం.. పరిటాల సునీత**

ఐదేళ్లుగా రాప్తాడు నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని.. ఆ రాక్షస పాలనకు స్వస్తి పలికారని సునీత అన్నారు. ప్రజలు ఇంత భారీ మెజార్టీ ఇవ్వడం ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఈ ప్రాంతానికి సాగునీరు ఇస్తామని చెప్పామని.. దానిని ఎప్పటికీ మరువమన్నారు. ముఖ్యంగా పేరూరు ప్రాజెక్టుకు గతంలో 804కోట్ల రూపాయల నిధులు తీసుకొస్తే.. ఒక అసమర్థ ఎమ్మెల్యే వలన పనులు ముందుకు సాగలేదన్నారు. కనీసం రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. అందుకే భూములిచ్చిన ప్రతి రైతుకు పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు మొదలు పెడతామని... పేరూరు ప్రాజెక్టుకు నీరు ఇచ్చితీరుతామన్నారు. ఇప్పటికే మన ప్రభుత్వం వచ్చిన తరువాత 4వేల రూపాయల పింఛన్ ఇచ్చామని.. కచ్చితంగా మిగిలిన హామీలు కూడా విడుతల వారిగా అమలు చేస్తామన్నారు. ఈ ప్రాంతానికి ఫ్యాక్షన్ వద్దని.. అభివృద్ధి వైపే అందరు దృష్టి పెడుతామన్నారు. పరిటాల శ్రీరామ్ కచ్చితంగా మీకు అండగా ఉంటారని.. ఏ కష్టం వచ్చిన మీరు చెప్పుకోవచ్చన్నారు. ధర్మవరం, రాప్తాడులో ఇద్దరు ఎమ్మెల్యేల్ని పరిటాల శ్రీరామ్ గెలిపించారని.. అదే సమయంలో ముగ్గరు మాజీ ఎమ్మెల్యేల్ని ఇంటికి పంపించారన్నారు...

**జెండా మోసిన కార్యకర్తకు న్యాయం చేస్తాం.. పరిటాల శ్రీరామ్**

తగరకుంట ప్రజలు చరిత్రలో నిలిచిపోయే విధంగా మెజార్టీ ఇచ్చారని.. ఇక్కడ ఓట్లు వేసిన ప్రజల్ని.. జెండా మోసిన కార్యకర్తను మరువమని ధర్మవరం టీడీపీ ఇన్ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఐదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడిన ప్రజలు.. అందరికీ గుర్తుండిపోయే విజయాన్ని ఇచ్చారని అన్నారు. పార్టీ కోసం ఎంతో మంది కష్టపడ్డారని.. వారందరికీ



న్యాయం చేస్తామని అన్నారు. చిన్న చిన్న స్పర్థలను పక్కన పెట్టి... మీకు ఏ అవసరం ఉన్న మాతో సంప్రదించవచ్చున్నారు. ప్రజల్లో కసి రేపడానికి ప్రకాష్ రెడ్డి మాటలే కారణమన్నారు. నేను ఓడిపోతే మీసం తీయించుకుంటానన్న ప్రకాష్ రెడ్డి మాటలే ఇంత పని చేశాయన్నారు. ఆయన కచ్చితంగా మీసం తీయించుకుంటారని.. దాని గురించి మనం మాట్లాడి సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధిపైనే దృష్టి పెడుదామని శ్రీరామ్ అన్నారు....

**రాప్తాడు ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది పరిటాల కుటుంబమే.. మంత్రి సవిత**

గతంలో మా తండ్రి మంత్రిగా ఉన్నప్పుడు ఈప్రాంతంలో అభివృద్ధి కనిపించిందని.. ఆ తర్వాత పరిటాల రవి, పరిటాల సునీతలే ఇక్కడ అభివృద్ధి చేశారని మంత్రి సవిత అన్నారు. ఐదేళ్ల పాటు ప్రకాష్ రెడ్డి అరాచక పాలన ఇక్కడ సాగిందని.. అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. జగన్ రెడ్డి దోచుకునే పనిలో ఉంటే.. ప్రకాష్ రెడ్డి సెటిల్మెంట్లకు పరిమితమయ్యారన్నారు. ఈ రాక్షస పాలన పోయిన తర్వాత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని.. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు కూడా నెరవేరుస్తున్నారన్నారు. నేను మంత్రి అయ్యాక పరిటాల సునీత విద్యార్థులకు బీసీ గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచమని అడిగారని.. అదే ఆమెకు పిల్లల చదువుల పై ఉన్న శ్రద్ధ అన్నారు. కచ్చితంగా వచ్చే ఏడాది నుంచి సీట్లు పెంచుతామని.. ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతుగా సహకరిస్తామన్నారు...

**అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబును అవమానించారు.. ఎంపీ పార్థసారథి**

రాష్ట్ర ప్రజలు దేన్ని అంత తేలిగ్గా మర్చిపోరని.. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబును అవమానించారని.. అందుకే ఆ అసెంబ్లీలో వారికి 11సీట్లు మాత్రమే మిగిల్చారని ఎంపీ పార్థసారథి అన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని.. దీనిని సరిచేయాల్సిన బాధ్యత చంద్రబాబు తీసుకున్నారన్నారు. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలు ప్రారంభమైందన్నారు. మరోవైపు ఈ రాక్షస పాలనలో ఎన్నో దెబ్బల్ని తట్టుకుని జెండా మోసిన కార్యకర్తల్ని ఎప్పటికీ మర్చిపోమన్నారు. వారికి తగిన విధంగా న్యాయం చేస్తామని.. దీనికి అందరం కట్టుబడి ఉంటామన్నారు..



జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.
ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్: 63011 07116




# పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను పరిష్కరించేందుకు చర్యలు

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**

అనంతపురము మేజర్ న్యూస్ : పెండింగ్ ఉన్న కోర్ట్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో రెవెన్యూ లీగల్ మేటర్స్ పై ఆర్డీవోలు, తహసిల్దార్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసులను రోజుకు ఒకటి చొప్పున వెంటనే క్లియర్ చేయాలని, కంటెంప్ట్ కోసం కేసులను కూడా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ వారిగా కోర్టు కేసుల పెండింగ్ ను జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కోర్టు కేసులను ప్రొసీజర్ ప్రకారం పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవోలు, తహసిల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవోలు, జి.వెంకటేష్ వి.శ్రీనివాసులురెడ్డి, రాణి సుస్మిత, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, తహసీల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలో బొగ్గలపల్లి, బి.రామాపురం

**– తాగునీటి కోసం తహతహలాడుతున్న గ్రామాల వాసులు**

నల్లమాడ, మేజర్ న్యూస్ : నల్లమాడ మండల పరిధిలో గల బొగ్గలపల్లి, బి. రామాపురం గ్రామాలలో గత మూడు రోజుల నుండి విద్యుత్ లేక పోవడం గ్రామాలు అంధకారం లో ఉండిపోయాయి. దీనితో తాగునీటి కోసం గ్రామాల ప్రజలు తహతలాడాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ లేక బోరు మోటర్లు పనిచేయని కారణంగా గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బం దులు గురవు తున్నా మని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ సమస్య వస్తే మూడు, నాలుగు రోజులైనా విద్యుత్ పట్టించుకోరని, దీనితో తాము నానా అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో మెయిన్ లైన్ నందు సమస్య రావడం చేత ఈ దుస్థితి నెలకొం టున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ సమస్య పట్ల సం బంధిత అధికారుల స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# అంబాపురం గ్రామాన్ని సందర్శించిన డిఎం అండ్ డిహెచ్ఓ

## -డయేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

**కనేకల్లు, మేజర్ న్యూస్ :** కనేకల్ మండల పరిధిలోని అంబాపురం గ్రామాన్ని మంగళవారం జిల్లా డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సందర్శించారు. గత నెల 30వ తేదిన గ్రామానికి చెందిన బోయ వంద్రప్ప డయేరియాతో మృతి చెందడంతో మృతుడు వంద్రప్ప గురించి యర్రగుంట గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మృతుని వివరాలు, అడిగి తెలుసుకొని, గ్రామంలో డయేరియాతో బాధ పడుతున్న అనసూయమ్మ తదితరులను పరామర్శించి జాగ్రత్తగా ఉండాలని డిఎం అండ్ హెచ్ ఓ సూచించారు. గ్రామంలో డయేరియాతో మృతి చెందడంతో గ్రామంలో శానిటేషన్ సక్రమంగా చేయించాలని, తాగునీటి పైపు లైన్ లీకేజీని, తాగునీటి సరఫరా తదితర అంశాల పై జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ సెక్రటరీ చంద్రకళను ఆదేశించారు. అలాగే గ్రామాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో డయేరియా ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా వైద్య శిబిరాన్ని కొనసాగించాలని వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ నాయక్ కు సూచించారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం.పీ.హెచ్.ఎస్.(మేల్) ప్రతాప్ పదవీ విరమణ, ఆశాడే కార్యక్రమంలో పాల్గొని స్టాప్ డయేరియా ప్రోగ్రాం, జూలై, ఆగష్టు నెలలలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని క్షేత్ర స్థాయిలో చేపట్టవలసిన కార్యక్రమాలు సంబధిత సిబ్బందికి సూచించారు. అనంతరం కనెకల్ మండలకేంద్రంలో ఫీవర్ కేసుల విషయమై క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫీవర్ కేసులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వర్తించాలని సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, డిపిఎమ్ఓ డాక్టర్ రవి శంకర్, జిల్లా ఎపిడిమిక్ టీం, స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.





## చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు

**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణములోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారికి బహుళ ఏకాదశి (యోగిని ఏకాదశి) సందర్భంగా అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాసులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహానికి గంధముతో అలంకరణ, తులసి మాలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా కట్టుకుంది. అనంతరం వేద మంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. గత మూడువందల సంవత్సరాల కిందట శ్రీకృష్ణదేవరాయల పరిపాలనలో ఈ ఆలయం ఎంతో ప్రతిష్టాత్మకంగా, మహిమ గల ఆలయంగా గుర్తింపబడిందని తెలిపారు. ఇప్పటికీ ప్రతినెలా తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించే గరుడ పౌర్ణమి సేవను దాతల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని అర్చకులు, ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. నేటి సమాజ పోటీ ప్రపంచంలో ప్రతి వ్యక్తికి మనశ్శాంతి అనేది దేవాలయంలోనే లభ్యమవుతుందని తెలిపారు. మనిషి యొక్క నిరంతర జీవితంలో కూడా దైవభక్తి అనేది తప్పక ఉండాలని, అప్పుడే కుటుంబం సుఖశాంతులతో విరాజల్లుతున్నది అని తెలిపారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాళ్ళ పుల్లయ్య వారి శిష్య బృందం అన్నమయ్య సంకీర్తన గానం అందరిని ముగ్దుల్ని చేసింది. ఈ కార్యక్రమంలో భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా మండల ఇంజనీర్ పదవీ విరమణ సత్కారం



ఉరవకొండ, మేజర్ న్యూస్ : ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగంలో వివిధ స్థాయిల్లో నాలుగు దశాబ్దాల కాలంగా తన వంతు సేవలందించి అందరి చేత విధేయత చాటుకున్నారని పదవీ విరమణ పొందిన మండల ఇంజనీరు వైఎస్ మధుసూదన్ రావు పట్ల తన అభిప్రాయాన్ని డిఈ అరుణ్ కుమార్ వెల్లడించారు. పంచాయతీరాజ్ భాగంలో మండల ఇంజనీరుగా విధులు నిర్వర్తించి ఇటీవల పదవి విరమణ పొందిన వైయస్ మధుసూదన్ రావు సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం డిఈ అరుణ్ కుమార్ అధ్యక్షతన స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఇంజనీర్ సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడికి తలోగ్గ కుండా తన వంతు సేవలందించినట్లు పలువురు గుర్తు చేశారు. అధికారులు, సిబ్బంది పట్ల సమభావాన్ని ప్రదర్శించే తత్వం ఆయనలో ఇమిడి ఉండటం ఆయన సొంతమన్నారు. సచివాలయ ఇంజనీర్ సహాయకులు మాట్లాడుతూ ఏలాంటి శిక్షణ లేని తమకు విధుల పట్ల అన్ని రకాల విషయాలపై పూర్తి అవగాహన కల్పించారని, వారికి ఎప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు. మండల ఇంజనీరు పదవీ విరమణ పొందడం ప్రతి ఒక్కరూ జీర్ణించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంపూర్ణ ఆరోగ్యంతో తన కుటుంబ సభ్యులతో కలిసి మండల ఇంజనీర్ వైయస్ మధుసూదన్ రావు తన శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు పలువురు అధికారులు కోరుకున్నారు. ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు, సిబ్బంది ఆధ్వర్యంలో మండల ఇంజనీర్ ను శాలువలతో పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బెలుగుప్ప, కూడేరు మండల ఇంజనీర్లు సుధాకర్, శ్రీనివాసులు, ఎగువ శ్రేణి సహాయకులు సాదిక్, మండల జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ శివప్ప, కంప్యూటర్ ఆపరేటర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామసభలు ఏర్పాటు చేసి

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

### -ఏపీ జిల్లా కౌలు రైతు సంఘం డిమాండ్



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** భూ యజమాని సంతకం నిబంధన తొలగించి, గ్రామసభ ఏర్పాటు చేసి తద్వారా ప్రభుత్వం కౌలు రైతుకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఏపీ జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, కార్యదర్శి బాల రంగయ్య డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకం నిబంధన తొలగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కి వినతి పేరుతో ఏపీ జిల్లా కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వమే గ్రామ సభలు ఏర్పాటు చేసి సిసిఆర్సి కార్డులను రైతులకు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సిసిఆర్సి కార్డు ఉన్న ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులో పంట రుణాలు ఇవ్వాలన్నారు. కులాలకు అతీతంగా భూమిలేని ప్రతి ఒక్కరికి సిసిఆర్సి కార్డు మంజూరు చేయాలని తెలిపారు. హెచ్ ఎల్ సి, హంద్రీనీవా, జి బి సి కింద ఉన్న కాలువల్లో పూడికతీత పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టి ఆఖరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు రైతు సహకార కేంద్రాల ద్వారా అందజేయాలన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డు లేకపోవడంతో అన్ని రకాల నష్టపోతున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కుమ్మరి వెంకటేశులు, వన్నూరు స్వామి, నాగరాజు, సుధాకర్, దుర్గన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూమిని లీజు పేరుతో నిరుపేద దళితులకు ఇవ్వాలి

### -మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి డిమాండ్



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని దేవదాయ శాఖ కు సంబంధించి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ భూమిని లీజు పేరుతో భూమిలేని నిరుపేద దళితులకు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కౌకుంట్ల రవి డిమాండ్ చేశారు. మంగళవారం సంబంధిత వినతి పత్రాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమూహ దేవాలయ కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరులు భూమిని తమదేనని కోర్టుల చుట్టూ తిరుగుతున్నట్లు గుర్తు చేశారు. ఇటీవల సదరు భూమి దేవాదాయ శాఖకు సొంతమని తీర్పును వెల్లడించినట్లు తెలిపారు. ఆలయ భూమిని ఎలాంటి బహిరంగ వేలం నిర్వహించకుండా భూమి లేని నిరుపేద దళితులకు కౌలు చెల్లించుకుని ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అలా కాకుండా భూమి ఉన్న వారికే ఆలయ భూములు కట్టబెడతామంటే సహించేది లేదని, దేవదాయ శాఖ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతానని ఈ సందర్భంగా మాదిగ దండోరా నాయకులు హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా పార్లమెంటు అధ్యక్షులు హెచ్ వెంకటేషులు, నియోజకవర్గ అధ్యక్షులు ఎం రామాంజనేయులు, ఉరవకొండ తాలూకా అధ్యక్షులు జే. చెన్నప్ప, సభ్యులు సురేష్, రామకృష్ణ, మారెన్న, నారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు ఆరోగ్య విషయాలపై అవగాహన



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఐదేళ్ల లోపు పిల్లలకు డయేరియా సోకకుండా ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని ఆశా కార్యకర్తలకు సిహెచ్ఓ నాగ రంగయ్య తెలిపారు. మంగళవారం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలకు ఆరోగ్య విషయాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ నాగ రంగయ్య, ఆరోగ్య విద్యా బోధకులు ఎస్. ఎండి షఫీ మాట్లాడుతూ అతి సారా నియంత్రణకు అవసరమైన చర్యల పట్ల ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. అతిసారా మహమ్మారిని అరికట్టడంలో ఓ ఆర్ ఎస్, జింక్ మాత్రల ప్రాధాన్యతను వివరించారు. పరిసరాల పరిశుభ్రత, చేతుల పరిశుభ్రత గురించి గ్రామస్తులకు తెలపాలన్నారు. అది సారతో బాధపడే బాధిత పిల్లలకు ఇవ్వవలసిన ఆహారం గురించి చెప్పారు. డెంగ్యూ నివారణ మాసోత్సవం పట్ల దిశా నిర్దేశం చేశారు. పగలు పుట్టే టైగర్ దోమ లేదా పులి దోమ వలన డెంగ్యూ జ్వరం సోకుతుందని గుర్తు చేశారు. అధిక జ్వరం, కీళ్లు కండరాల నొప్పి, అధికంగా దాహం వేయడం వాంతి కలిగినట్టు భ్రాంతి కలగడం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడితే డెంగ్యూ లక్షణాలుగా గుర్తు చేశారు. అనంతరం లెప్రసి ఎల్ సి డి సి సర్వే కార్యక్రమ విషయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదవీ విరమణోత్సవం

- సరికొత్త సంప్రదాయానికి జిల్లా కలెక్టర్ శ్రీకారం - ఇంతకుముందెన్నడూ లేనివిధంగా సామూహిక పదవీ విరమణ కార్యక్రమం నిర్వహణ
- స్ఫూర్తిదాయకం.. జిల్లా కలెక్టర్ నిర్ణయం - పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, సిబ్బంది సేవలు ఎంతో అమూల్యమైనవి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి - పదవీ విరమణ పొందిన వారికి ఘన సన్మానం.. శాలువా, ఒక మొక్క, మెమెంటో అందజేత

**అనంతపురం, మేజర్ న్యూస్ :** ప్రతి ఉద్యోగ జీవితంలో చివరకు పదవీ విరమణ అనేది తప్పనిసరి. ఇప్పటివరకు పదవీ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి వారి కార్యాలయాలలోనే ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చేది. అలా కాకుండా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వినూత్నంగా ఆలోచించి సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఒక స్ఫూర్తిదాయకమైన నిర్ణయం తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల పరిధిలో ప్రతినెల ఉద్యోగ విరమణ పొందుతున్న వారందరికీ జిల్లా కలెక్టరేట్ లోనే సన్మాన కార్యక్రమం చేయాలని నిర్ణయించారు. అనుకున్న వెంటనే దాన్ని ఆచరణలో పెట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల పరిధిలో పదవీ విరమణ పొందిన 70 మంది జిల్లా అధికారుల నుంచి కిందిస్థాయి అటెండర్, సిబ్బంది వరకు ఉద్యోగులకు సామూహిక పదవి విరమణోత్సవం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. దీంతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మా జీవితంలో చిరకాలం గుర్తుండిపోయే సందర్భం అంటూ, జిల్లా కలెక్టర్ నిర్ణయం స్ఫూర్తిదాయకం అంటూ చప్పట్లతో అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో మంగళవారం రాత్రి జిల్లాలో రెండు నెలలుగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఆత్మీయ అభినందన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

**సేవలు ఎంతో అమూల్యమైనవి : జిల్లా కలెక్టర్**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగ జీవితంలో ఉద్యోగంలో చేరిన రోజు, పదవీ విరమణ చేసి కార్యాలయం నుంచి ఇంటికి వెళ్ళిన రోజు ఎంతో ముఖ్యమైనవన్నారు. అలాంటి ముఖ్యమైన పదవీ విరమణ కార్యక్రమాన్ని ఈరోజు సామూహికంగా నిర్వహిస్తున్నామని, ఇది ఎంతో పవిత్రమైన పని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం అనేది సుదీర్ఘమైన సేవ అని, ఉద్యోగంలో ప్రతి ఒక్కరు సేవలు అమూల్యమైనవన్నారు. ప్రతి ఒక్కరి సేవ గుర్తించేందుకు జిల్లా అధికారుల నుంచి కిందిస్థాయి అటెండర్, సిబ్బంది వరకు పదవీ విరమణ పొందిన వారికి జిల్లా కేంద్రంలో సన్మాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. 30 ఏళ్లకు పైగా అన్ని రకాల అనుభవాలు ఎదుర్కొన్న వారికి సన్మానం చేయడం మంచి కార్యక్రమం అన్నారు. జిల్లా కేంద్రంలో ఇది మొట్టమొదటి కార్యక్రమమని, పదవీ విరమణ చేసిన తరువాత వారు వచ్చి కార్యాలయాల వద్ద తిరగాల్సిన అవసరం లేకుండా చూసేలా, ఉద్యోగ విరమణ రోజునే వారి పెన్షన్ కార్యక్రమం హ్యాండోవర్ చేసేలా, జిపిఎఫ్ స్పాట్ పేమెంట్ అయ్యేలా, పెన్షన్ ప్రపోజల్ వెంటనే పంపుతామన్నారు. పదవీ విరమణ పొందిన వారి స్థానంలో మరొకరిని వెంటనే నియమించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈరోజు పదవి విరమణ చేసిన 70 మంది ఉద్యోగులు జిల్లా ప్లాంటేషన్ గురించి అంబాసిడర్ లుగా



పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరికి మొక్కలు ఇస్తున్నామని, మీ ఇంటి వద్దకు వెళ్లి మొక్క నాటి, ప్రతిజ్ఞ పత్రం నింపి ఆ కాపీని జిల్లా పరిషత్ సీఈఓకి పంపించాలన్నారు. ఇది కొత్త జీవితానికి నాంది అని, పదవి విరమణ రోజు ప్రతి ఒక్కరూ మొక్క నాటాలన్నారు. ఇప్పటివరకు ఉద్యోగులంతా ప్రభుత్వం కోసం పని చేశారని, ఇప్పుడు మీ కుటుంబానికి మీ అవసరం ఉందని, మీ పిల్లలకు మంచి విషయాలు చెప్పాలని, మీ ఆరోగ్యం పై దృష్టి సారించాలని వ్యక్తిగత ఆరోగ్యం చూసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి



మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సామూహికంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఆత్మీయ అభినందన సన్మాన సభ నిర్వహించడం ఎంత గొప్ప కార్యక్రమం అన్నారు. అధికారులు, ఉద్యోగులంతా ఆయా శాఖలకు గొప్ప సేవలు చేశారని కొనియాడారు. పదవీ విరమణ తర్వాత ప్రతి ఒక్కరూ సంతోషంగా వారి కుటుంబ సభ్యులతో గడపాలని, వారందరికీ ఆరోగ్యం, సంతోషం లభించాలని కోరుకున్నారు.

**పదవీ విరమణ పొందిన వారికి ఘన సన్మానం.. శాలువా, ఒక మొక్క, మెమెంటో అందజేత :**

ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన డిప్యూటీ



కలెక్టర్లు, తహసీల్దార్, ఎంపిడిఓలు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలుపుకుని మొత్తం 70 మందిని జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. వారంతా కూర్చున్న చోటుకే జిల్లా కలెక్టర్ వెళ్లి వాళ్ళందరికీ శాలువా, ఒక మొక్క, మెమెంటో అందజేశారు. అందించిన మొక్కను జాగ్రత్తగా నాటాలని, ప్రతిరోజు నీరు పోయాలని, దానిని పెరిగి పెద్దయ్యే వరకు సంరక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇది నేను పదవీ విరమణ పొందిన రోజున నాటిన మొక్క, దీనిని నేను సంరక్షిస్తాను అని ప్రతిజ్ఞ చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వారందరితో గ్రూప్ ఫోటో దిగారు. తదనంతరం జిల్లా కలెక్టర్ ని నగరపాలక సంస్థ కమిషనర్, జిల్లా పరిషత్ సీఈఓ, డిఆర్ఓలు శాలువా కప్పి మెమెంటో అందజేసి సన్మానించారు. అనంతరం నగర పాలక సంస్థ కమిషనర్ ని, జెడ్పి సీఈవో ని కూడా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసులు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, హెచ్ ఎల్ సి ఎస్ఈ రాజశేఖర్, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, జిల్లా మలేరియా అధికారి ఓబులు, పదవీ విరమణ పొందిన డిప్యూటీ కలెక్టర్లు వరప్రసాద్, శంకరయ్య, పీఆర్ ఎస్ఈ ఎర్రిస్వామి, పదవీ విరమణ పొందిన తహసీల్దార్ నాగభూషణం, ఎంపిడిఓలు సుధాకర్ బాబు, కమల్ భాష, ఏపీఆర్ఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కుళ్లాయప్ప, ఇతర పదవీ విరమణ పొందిన వివిధ శాఖల అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

